# మడి



## ఎమ్.సి. శివశంకర శాస్త్రి

తూరుపు తెల్లబడకనే నదీ స్నానం చేసి తడి బట్టను మడి కట్టుకుని రాగి బిందె నిండా నీరు తీసుకుని శివస్తోత్రం చేసుకుంటూ శివాలయానికొస్తున్న లింగమూర్తికి, అల్లంత దూరంలో తూలుతూ ఎదురొస్తున్న రంగడు కనిపించగానే ఆ తాగుబోతు తన్నెక్కడ తాకు తాడోనన్న భయంతో గుడికేసి అడుగులు వడిగా వేశాడు లింగమూర్తి.

''దండాలండయ్యా! దండాలు'' లింగమూర్తిని సమీపిస్తూ అన్నాడు రంగడు.

''ఒరేయ్ తాగుబోతు వెధవా! అప్పుడే తెల్లవారిందట్రా నీకు? ఛీ! ఛీ!! నీ నీడ పడి మడి కాస్త మంట కలిసిపోయి మైల పడ్డాను'' పఠిస్తున్న శివస్తోత్రం ఆపివేసి రంగణ్ణి తెగ తిట్టేశాడు లింగమూర్తి.

''అంత మాటనకండయ్యా! నేనెంత సెడ్డా మీ కొడుకునే గంద'' తూలుతూ పలికాడు వాడు. ఈ మాటలు చెవిన పడగానే బలంగా ఎవరో ఎదపై గుద్దినట్టయి దిగ చెమటలు పట్టాయి. అయినా తమాయించుకుని ''ఒరేయ్ నోటికి వచ్చిందల్లా మాటేనని వాక్కు. నేనెవరు? నువ్వెవరు?? నేను నీ అయ్యనెందుకవుతాన్రా?'' భుజం మీది తడి తుండుతో ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ అన్నాడు లింగమూర్తి.

''అయన్నీ నాకేం తెలియవు గాని నా అయ్యవు నువ్వేనని మాత్రం మా యమ్మ ఎప్పుడూ అంటుంటుంది. కావాలంటే మా యమ్మతోటే పలికిస్తాను రండి'' చేయి పట్టుకోబోయాడు రంగడు.

''వద్దు... ఇక నువ్వేం చెప్పించక్కర లేదు. ముందు నీవిక్కణ్ణుంచి వెళ్ళు'' బిందెలోని నీళ్ళన్నీ అక్కడే గుమ్మరించి, మడి మంట కలిసిందని గొణుక్కుంటూ నదికేసి పోబోయాడు లింగమూర్తి.

''అయ్యా! మాటిమాటికీ మడీ మడీ అంటుంటారే, నేను పుట్టకముందు మా యమ్మ గంగితో సావాసం సేసినప్పుడు ఏడకు బోయింది మీ మడి? వున్నట్టుండి మళ్ళీ ఎప్పుడొచ్చింది?'' రంగడడిగిన ప్రశ్నతో నోరు కట్టినట్టయి, నాలుక తడారిపోయింది. బదులు చెప్పే ధైర్యం లేక చుట్టూ కలియ చూశాడు. వాళ్ళిద్దరు తప్ప మరెవ్వరూ లేరక్కడ. ఇహ తప్పుకోవడం ఎంతయినా మంచిదని గబగబా నదికేసి నడిచాడు లింగమూర్తి.

నడక కాదది పరుగు!

మళ్ళీ నదిలో మునిగి నిండు బిందె భుజాన వేసుకుని గుడివేపు దారితీశాడు.

ఈలోగా రంగడు సరాసరి గుడి దగ్గర కెళ్ళి అక్కడ అడ్డు నిలబడ్డాడు. మళ్ళీ గుడిదగ్గర వాడగుపించేసరికి లింగమూర్తికి ఒళ్ళు మండిపోయింది. ''ఒరేయ్! నువ్వు మనిషివా? పశువ్వా? మళ్లీ ఎందుకొచ్చావిక్కడికి?'' కస్సున లేచాడు.

''ఇందాక నా మాట దాటేసిపోయేరు. ఇంతకీ నేను మీ కొడుకునా? కాదా? నిజం సెబితే బతికుండగా మళ్ళీ మీ కంటబడకుండా పోతాను'' ఈసారి రంగని గొంతుక బొంగురుపోయింది.

ఈ మాటలు లింగమూర్తిని రివ్వున పాతికేళ్ల కిందికి లాక్కెళ్ళాయి.

* * *

పాతికేళ్ళ క్రితం లింగమూర్తి వయస్సు ఇరవైమూడేళ్ళు. సంస్కృతంలో పట్టా పొంది ముంజేతి బంగారు కంకణంతో ఠీవిగా తిరుగాడుతున్న కుమారుని విద్వత్ప్రతిభకు ఎంతగానో మురిసిపోయాడు మహాదేవశాస్త్రి. వయోధర్మ రీత్యా తిరుగాడ సత్తువ లేక వంశపారంపర్యంగా వస్తున్న ఆలయ అర్చకత్వాన్ని మెల్లిగా కుమారుడికే అప్పగించాడు.

అన్నీ సవ్యంగా సాగిపోతున్నాయి. ఆ రోజు తెల్లవారు జామునే లింగమూర్తి నదీ స్నానం చేసి మడి నీళ్ళ బిందె భుజాన పెట్టుకుని గుడికొస్తుండగా నవజవ్వన తరుణి గంగి, ఓ మెరుపు తీగలా నది గట్టున కనిపించింది. ఎదురొడ్డి వస్తున్న యవ్వనపు పొంగులతో నవనవలాడుతోంది గంగి. మొనదేరిన ముక్కుకున్న నత్త, ముడివేసిన వోరగొప్పు, నిండు చందమామను పోలిన గుండ్రని చాదు బొట్టు వగైరాలన్నీ ఆ నల్లటి ముఖానికి మరింత అందం తెచ్చిపెట్టాయి. కాళ్ళ కడియాలు తకిథిమి పలుకుతుండగా చంకన పేడ తట్టతో వయ్యారంగా వస్తున్న గంగి, లింగమూర్తికి నిజంగా రతీదేవిలా కనిపించి నట్టయి మతి చలించింది.

''ఓహో! నువ్వటే గంగీ! తూరుపు తెల్లబడకనే ఇలా బయలుదేరావేం?'' మెల్లగా ఆమె వస్తున్నవేపే ఎదురెళ్ళి చిరునవ్వుతో పలకరించాడు.

''పిడకలకు పేడ పోగు చేద్దామని వచ్చానండయ్యా!'' నేల చూపు చూస్తూ చెప్పింది గంగి. వస్తానన్నట్టు తలూపి తుర్రున పారిపోయిందక్కణ్ణుంచి.

లింగమూర్తి చలించిపోయాడు. ఊహకందని తీయని తాపం వేధించడంతో ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. వేకువకై వేచి చూశాడు. కోడి కూయగానే బిందె భుజాన వేసుకుని నదివైపు నడిచాడు. స్నానానంతరం గబగబా గుళ్ళో అభిషేకం అయిందనిపించేసి, కూనిరాగాలు పాడుతూ బయటికొచ్చి నుంచున్నాడు.

ఇంకా చీకటి విడిపోలేదు.

అల్లంత దూరంలో ఆ రూపం మెదిలింది. కళ్ళు పెద్దవిగ చేసి చూశాడు.

అది గంగి!

రివ్వున గుళ్ళోకెళ్ళి ఓ కొబ్బరి చిప్పలో రెండు నంది వర్ధనాలు పడేసి, గంగికి ఎదురెళ్ళి ''ఇవిగో తీసుకో... దేవుడి ప్రసాదం'' అంటూ దాన్ని తగలకుండా అలా చేతిలోకి పడేశాడు. ప్రసాదం తీసుకుని భక్తితో కళ్ళ కద్దుకుని ఆ రెండు పూలూ కొప్పున పెట్టుకుంది.

ఆమె ఎదలకేసి రెప్పవాల్చకుండా కసిగా చూస్తున్నాడు లింగమూర్తి.

ఆ చూపులు పసిగట్టి మెల్లగా కొప్పులోంచి ఓ పువ్వు తీసి వయ్యారంగా అతని ముఖంకేసి విసిరి కింది పెదవి ముని పంట నొక్కిపట్టి కిలకిలా నవ్వుతూ అలాగే నుంచుంది.

ఆ చిలిపి చేష్టలకు మరింత ఉద్రిక్తుడై చలుక్కున ఆమె చేయి పట్టి తనవేపు లాక్కుని గట్టిగా కౌగలించుకున్నాడతను.

''బాబయ్యా! నన్నంటరాదు'' అతని బాహుబంధం నుంచి విడిపించుకో ప్రయత్నంతో అంది గంగి.

నరాలు జివ్వుమన్నాయి. ఈసారి మరింత గట్టిగా బిగియపట్టి తనివితీరా ముద్దెట్టుకున్నాడు.

వణికిపోతోంది గంగి.

''ఏం అలా వణికిపోతున్నావ్?'' అన్నాడు లింగమూర్తి.

''వద్దు బాబయ్యా! వద్దు. నన్ను సెడిపి మీరూ సెడిపోకండి'' అంటూ తన కులం గురించి మరోసారి గుర్తుచేయబోయింది.

ఈసారి నోటికి చేయడ్డుపెట్టి ''గంగీ నిన్ను మనసారా ప్రేమించాను. ఈ జగత్తులో ఆడ, మగ అనే రెండు జాతులు తప్ప ఇంకే జాతి లేదు. అయినా ప్రేమికుల మధ్య జాతి భేదాలుండకూడదని కామసూత్రాలు రాసిన వాత్సాయనుడే చెప్పాడు'' అంటూ మరింత దగ్గరకు లాక్కున్నాడు.

''వద్దు బాబయ్యా! నా మాట ఇనుకోండి. దయజేసి నా జీయితం పాడు సేయకండి'' బతిమలాడింది.

''గంగీ! ఇహ నువ్వేం చెప్పకు. ఈ శుభసందర్భంలో దేవుడిమీద వొట్టేసి చెబుతున్నాను. ఇప్పట్నుంచీ మనిద్దరం భార్యాభర్తలం'' అంటూ ఇద్దరిమధ్యా గాలి కూడా చొరబడనంతగా గంగిని పెనవేసుకుని ముద్దులతో ముద్దచేసి అక్కడే ఆ ఇసుక తిన్నెల మీదే ఆమె అందాల్ని తన స్వంతం చేసుకున్నాడు.

పరువాల గంగి కూడా అతనితో సహకరించింది. ఇద్దరూ స్వర్గపు టంచుల్ని చవి చూశారు. అటుపై ప్రతి దినం సరిగ్గా అదే సమయానికి అక్కడే ఆ ఇసుక తిన్నెలమీదే ఆ రెండు శరీరాలు ఏకమయ్యేవి.

ఫలితంగా గంగికి నెల తప్పింది.

పెళ్ళికాని తన కూతురు కడుపయిందని తెలుసుకున్న కన్నయ్య నిప్పులు కక్కాడు. సారా కొట్టుకెళ్లి పీకల్దాక నాటు పట్టించి, బిడ్డను గొడ్డును బాదినట్టుగా బాదేసరికి నిజం కక్కేసింది గంగి. కొప్పు పట్టి అర్చకుల వారింటికీడ్చుకెళ్ళి పేరెట్టి పిలుస్తూ మహాదేవ శాస్త్రిని బయటకు రమ్మన్నాడు.

బయటికొచ్చాడు శాస్త్రి. పంచనే నుంచున్న గంగిని, దానయ్య కన్నయ్యను చూసి ''ఒరేయ్ ఇది ఎవరిల్లనుకున్నావ్? మడి ఆచారం పాటించే మా లోగిలిలోకి మీరు రావచ్చా? ముందు బయటకు నడు'' గుడ్లురుముతూ గర్జించాడు.

''ఏంటయ్యగోరూ మీ మడి?'' వెకిలిగా అన్నాడు కన్నయ్య.

''ఏరా! ఎగతాళిగా వుందా? నువ్వెంత? నీ కులమెంత? అయినా నువ్వెవడివిరా మా మడీ ఆచారం గురించి అడగడానికి. ఊ! ముందు బయటకు నడు'' రెచ్చిపోతూ అన్నాడు మహాదేవశాస్త్రి.

''మీ కొడుకుగోరు సేసిన మడీ ఆశారం గురించి సెప్పుకోవాలని వొచ్చినోణ్ణి నేనెందుకు పోతానండయ్య'' అక్కడే కూర్చుంటూ అన్నాడు కన్నయ్య.

''ఏమిట్రా నువ్వంటున్నదీ?''

''నేనంటున్నది గాదు. ఇదిగో దీన్నే అడగండి. అంతా సెప్పుద్ది'' గంగిని ముందుకు తోసేసరికి జరిగిందంతా చెప్పేసింది.

చెవులు దిమ్మెక్కి కళ్ళు బైర్లుగమ్మాయి మహాదేవశాస్త్రికి. జరుగకూడనిది జరిగిపోయినందుకు విపరీతంగా చింతిస్తూ ఇందుకు తానేం చేయాలో కూడా వాణ్ణే సలహా అడిగాడు.

''మానం సెడ్డ నా కూతుర్ని మరెవ్వరూ మనువాడరు. కనుక దీనికి, దీని కడుపున పుట్టబోయే బిడ్డకూ ఏదేనా బతుకు తెరువు సూపండి. ఇంతకంటే ఇంకేమొద్దు బాబయ్యా'' అన్నాడు.

వాడి పలుకుల్లో దీనత వినిపించింది.

కాసేపాలోచించి లోనికెళ్ళి కలం, తెల్ల కాగితం పట్టుకొచ్చి ఏదో రాసి దాన్ని కన్నయ్య కందిస్తూ ''నీ బిడ్డకు, ఆమె కడుపున పుట్టబోయే సంతుకు నా రెక్కల కష్టంతో సంపాదించిన ఎకరం మాగాణీ పొలాన్ని రాసిచ్చాను. ఇక గుట్టు చప్పుడు కాకుండా ఇక్కణ్ణుంచి వెళ్ళిపో'' కనుకొలకుల్లోని కన్నీటిని భుజం మీది తుండు గుడ్డతో తుడుచుకుంటూ విచారంగా అన్నాడు మహాదేవశాస్త్రి.

కాగితం తీసుకున్న కన్నయ్య బయటికెళుతూ ఓసారి ఆగి మహాదేవశాస్త్రిగారి కేసి చూస్తూ ''బాబయ్యా! మడి అంటే ఏంటో నాకు సెప్పారు కాదు'' గుర్తుచేసేసరికి ''ఇహ మళ్ళీ ఆ ఊసెత్తకు. దయజేసి ఇక్కణ్ణుంచి వెళ్ళిపో'' చేతులు జోడిస్తూ అన్నాడు.

ఈలోగా అలా బయటకెళ్ళిన పుత్రరత్నం రావడం, 'పరజాతి స్త్రీని సంగమించిన నీవు ఇహ నా ఇంట ప్రవేశించవద్దని' చెప్పడంతో చేసిన తప్పుకు కట్టుబట్టలతో లింగమూర్తి దేశాంతరం వెళ్ళిపోవడం అన్నీ వెంట వెంటనే జరిగిపోయాయి.

పాతికేళ్ళ క్రితం జరిగిన తతంగమిదంతా.

* * *

తండ్రి మాట మీద ఆనాడు దేశాంతరం వెళ్ళిపోయిన లింగమూర్తికి తండ్రి గతించిన వార్త తెలిశాక స్వగ్రామం తిరిగొచ్చి ముసలి తల్లికి ఆసరాగా వుంటూ మళ్లీ అర్చకత్వం చేపట్టాడు.

గతంలో జరిగిన అక్రమ సంపర్క ఫలితం ఈనాడు రంగని రూపంలో అదే శివాలయం ముందు నిలదీసి అడిగేసరికి, నాటి సంఘటనంతా గుర్తుకొచ్చి కళ్ళముందు తన గంగి కదిలినట్టయింది.

పర్యవసానం గురించి బాగా ఆలోచించాడు లింగమూర్తి. మనసు ముందుకు పొమ్మందే కాని ఆచారమనే బూజు పట్టిన భావాలను వేలాడవద్దంది.

అయినా ఆచార వ్యవహారాలను ధిక్కరించేదెలా? అని ప్రశ్నించుకున్నాడు మళ్ళీ.

'అవన్నీ ఖాతరు చేయకు. నిన్ను నమ్మి తన శరీరాన్ని నీకప్పగించిన ఆ అమాయకురాలిని మోసం చేయకు. ఊ! అడ్డుగోడల్ని తెంపుకుని అడుగు ముందుకు వెయ్' మరోసారి ధైర్యం చెప్పింది అంతరాత్మ.

''నేను ద్రోహిని. అందుకే ఆ అమాయకురాలిని వదిలేసి దేశాంతరం పారిపోయాను. కాని నన్ను నమ్ముకున్న ఆ అరుంధతి మాత్రం మరెవర్నీ మనువాడలేదు. ఏ కళంకమూ తెచ్చుకోలేదు. నేను బ్రాహ్మణుడిని, ఆమె అంటరానిదని హెచ్చు తగ్గులిక వద్దు'' అంటూ బిగ్గరగా అరచాడు లింగమూర్తి.

మెల్లిగా అడుగు ముందుకు కదిపి అమాంతం కౌగలించుకుని ''బాబూ రంగా! ఈ రంగు పులిమిన కులమతాలు, మడి ఆచారాలు నాకిక వద్దుగాక వద్దు. నోరారా నన్నోసారి 'నాన్నా' అని పిలువు బాబూ, 'నాన్నా' అని పిలువు'' వాత్సల్యంగా రంగని తల నిమురుతూ అన్నాడు లింగమూర్తి.

''అయ్యా!'' అని ఎలుగెత్తి పిలిచిన రంగని పిలుపుతో ఆ బాంధవ్యానికి ఆ దేవుడే సాక్షి అన్నట్టు 'అయ్యా!' అంటూ గర్భగుడి కూడా ప్రతిధ్వనించింది ఆవెంటనే.

వెచ్చని ఆనంద బాష్పాలు రెండు రంగని వీపు మీద సర్రున జారాయి.


## కథా రచయితలకు ఆహ్వానం

తెలుగువారి జీవనాన్ని, సంస్కృతినీ సంఘర్షణనీ ప్రతిబింబించే కథలకు 'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆహ్వానం పలుకుతోంది.

మానవ జీవనంలోని వివిధ కోణాలమీద వెలుగు ప్రసరించే, ఆసక్తికరమైన కథలకు ప్రాధాన్యత వుంటుంది. కథలు నాలుగు లేక అయిదు అరఠావులకు మించకూడదు. కనీసం 2,500 పదాలకు తగ్గక ఉండాలి!

కథలు ఈ కింది చిరునామాకి పంపించాలి.

ఎడిటర్.
'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆంధ్రజ్యోతి దినపత్రిక,
బంజారా హిల్స్, రోడ్ నెం.3,
హైదరాబాద్- 500 034